సాక్షి తిరుపతి

సోమవారం । 26 । ఆగస్టు । 2024



నేడు తిరుపతిలో ట్రాఫిక్ మళ్లింపు
శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని తిరుపతి నగరంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. - 8లో



శ్రీవారి బ్రహ్మోత్సవాల భద్రతపై సమీక్ష
తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఆదివారం కొండపై భద్రతా ఏర్పాట్లను ఎస్పీ సమీక్షించారు. - 8లో



వినూత్న నిరసన
స్విమ్స్ జూనియర్ డాక్టర్లు ఆదివారం ఆందోళన కొనసాగించారు. చీపుర్లతో ఊడుస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

అతివల అభ్యున్నతికి 'లక్‌పతి దీదీ'



మెగా చెక్ అందిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి అర్బన్ : మహిళలను అభ్యున్నతే లక్ష్యంగా కేంద్రప్రభుత్వం లక్‌పతి దీదీ యోజన ప్రవేశపెట్టినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఆదివారం మహారాష్ట్ర నుంచి ప్రధానమంత్రి వర్చువల్‌గా ప్రారంభించిన కార్యక్రమంలో తిరుపతి కలెక్టరేట్ నుంచి ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యంతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ రేషన్ కార్డులు, ఇంటి పట్టాలు తదితర పథకాలను మహిళల పేరుతోనే మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. డీఆర్‌డీఏ పీడీ ప్రభావతి మాట్లాడుతూ స్త్రీనిధి, ఉన్నతి తదితర పథకాల ద్వారా పొదుపు సంఘం సభ్యులు రుణాలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం లక్‌పతి దీదీ యోజన కింద 7,905 మంది పొదుపు సంఘాల సభ్యులకు రూ.98.11 కోట్ల రుణాల చెక్కును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ జయలక్ష్మి, డీఆర్‌డీఏ డీపీఎం మాధవి పాల్గొన్నారు.

శ్రీసిటీలో ఫిట్‌నెస్ సెంటర్



సెంటర్ ప్రారంభిస్తున్న పరిశ్రమల ప్రతినిధులు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): సామాజిక మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా స్థానిక క్రీక్ సైడ్ రెసిడెన్షియల్ సమీపంలోని షాపింగ్ ఆర్కేడ్ రెండో అంతస్తులో ఫిట్‌నెస్ జోన్ పేరిట నూతన ఎయిర్ కండిషన్డ్ జిమ్‌ను శ్రీసిటీ ప్రారంభించింది. నివాసితుల ఫిట్‌నెస్ అవసరాలను తీర్చడానికి సుమారు రూ. 30లక్షల వ్యయంతో ఈ సెంటర్ నెలకొల్పారు. ఆదివారం రాక్‌వర్త్ పరిశ్రమకు చెందిన శ్రీరామ్, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్ కుమార్ చేతులమీదుగా జిమ్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ, మెరుగైన జీవనశైలి కోసం క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. జిమ్ ఏర్పాటుపై శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో సంతోషం వ్యక్తం చేశారు.

నేటి గ్రీవెన్స్ రద్దు

తిరుపతి అర్బన్ : శ్రీకృష్ణాష్టమి సందర్భంగా సోమవారం సెలవు నేపథ్యంలో కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కోసం వచ్చే అర్జీదారులు గమనించాలని సూచించారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ బాట గంగమ్మ ఆలయం వద్దకు చేరింది. శనివారం అర్ధరాత్రి వరకు 79,521 మంది స్వామిని దర్శించుకున్నారు. 40,152 మంది తలనీలాలు సమర్పించారు. స్వామికి కానుకల రూపంలో హుండీలో రూ.3.87 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శనం టికెట్లు లేని వారికి 24 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లున్న భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి మాత్రమే క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళితే లోనికి అనుమతించబోమని పేర్కొంది.

నిబంధనలు కఠినతరం



ఆస్పత్రుల్లో భద్రత విషయంపై ప్రభుత్వం నిబంధనలను మరింత కఠినతరం చేయాలి. మంచి వాతావరణం ఉంటేనే రోగులకు నాణ్యమైన వైద్యం అందించేందుకు అవకాశముంటుంది. పోలీసు భద్రతను తక్షణం కల్పించేలా చర్యలు తీసుకోవాలి. సెక్యూరిటీ స్టాఫ్‌ను కూడా వార్డుల్లో పెంచాలి. ప్రజల ప్రాణాలను కాపాడుతున్న వైద్యులపై దాడులు దారుణం. ముఖ్యంగా మహిళా డాక్టర్లు ధైర్యంగా విధులు నిర్వర్తించే పరిస్థితి కల్పించాలి. రోగుల సహాయకులను నియంత్రించాలి.

– డాక్టర్ శశిధర్ రెడ్డి, తిరుపతి



చట్టాలు అవసరం



మహిళ వైద్యులకు తక్షణ భద్రత అవసరం. తీవ్రతను తగ్గించే మాటలు వద్దు. తాత్కాలిక ఉపశమనం కల్పించినే మాటలు వింటూనే ఉన్నాం. మహిళ వైద్యుల భద్రత విషయంలో కఠినమైన చట్టాలు అవసరం. రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ సమావేశాల్లో ఈ చట్టాలు వస్తాయని ఆశిస్తున్నాం. కోల్‌కతా వైద్యురాలికి జరిగిన అన్యాయం ఇక పునరావృతం కాకూడదు. ఈ స్థాయిలో ఉద్యమాలు జరుగుతున్నా స్విమ్స్‌లో డాక్టర్‌పై పేషెంట్ దాడి చేయడం ఆందోళన కలిగించింది. ఇలాంటి దాడులు మా ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తాయి.

– డాక్టర్ సుదీప, వైద్య విద్యార్థిని, స్విమ్స్

మోడల్





గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూపొందించిన మోడల్ బస్టాండ్ ప్లాన్ (ఇన్‌సెట్) ప్రయాణికుల గ్యాలరీ నమూనా

ప్రజా ప్రయోజనాలను ప్రభుత్వం తుంగలో తొక్కేస్తోంది. గత వైఎస్సార్‌సీపీ సర్కారు శ్రీకారం చుట్టిన జనహిత ప్రాజెక్టులపై శీతకన్ను వేస్తోంది. ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతిలో ప్రతిష్టాత్మకంగా నిర్మించాలని తలపెట్టిన మల్టీ మోడల్ బస్టాండ్‌పై నిర్లక్ష్యం వహిస్తోంది. లక్షలాది మంది ప్రయాణికులకు అత్యున్నత వసతులు కల్పించే ఆధునిక భవన పనులను పూర్తిగా పక్కనపెట్టేస్తోంది. రూ.500 కోట్ల వ్యయంతో 11 అంతస్తుల అద్భుత నిర్మాణానికి మోకాలడ్డుతోంది. క్షేత్రస్థాయిలో కేంద్ర కమిటీ బృందం పర్యటించి అందించిన నివేదికలను బుట్ట దాఖలు చేస్తోంది. భూసేకరణలో భాగంగా నిర్వాసితులకు పరిహారం చెల్లింపుల్లోనూ జాప్యం చేస్తోంది. నగరవాసుల ఆకాంక్షలను అణగదొక్కేందుకు కక్షపూరితంగా వ్యవహరిస్తోంది.

- తిరుపతి మల్టీ మోడల్ బస్టాండ్ నిర్మాణంపై అలసత్వం
- పరిహారం చెల్లింపుల్లో జాప్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- కేంద్ర కమిటీ పర్యటనలో బయటపడిన నిర్లక్ష్యం
- గత వైఎస్సార్‌సీపీ సర్కారులో నూతన నిర్మాణానికి శ్రీకారం
- రూ.500 కోట్లతో 11 అంతస్తుల భవన నమూనా సిద్ధం

తిరుపతి అర్బన్ : తిరుమల శ్రీవారి దర్శనానికి దేశవిదేశాల నుంచి వచ్చే యాత్రికులు తిరుపతి మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం తిరుపతికి సుమారు లక్ష మంది తరలివస్తుంటారు. ఈ క్రమంలో నగరంలోని సెంట్రల్ బస్టాండ్‌లో రద్దీకి అనుగుణంగా ప్రయాణికులకు సౌకర్యాలు అందుబాటులో లేవు. దీంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మల్టీ మోడల్ బస్టాండ్ నిర్మించాలని ప్రణాళిక రూపొందించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం సహకారంతో రూ.500 కోట్ల వ్యయంతో 11 అంతస్తుల్లో ఆధునిక బస్టాండ్ భవనం నిర్మించాలని తలపెట్టింది. సుమారు 3లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు వీలుగా నమూనా రూపొందించింది. ఇందుకు కేంద్ర ప్రభుత్వం సైతం ఆమోదం తెలిపింది. ఓ వైపు రూ.350 కోట్లతో తిరుపతి రైల్వేస్టేషన్ ఆధునీకరణ, మరోవైపు అంతర్జాతీయ విమానాశ్రయం అభివృద్ధితో తిరునగరికి విచ్చేసే యాత్రికులకు ఇబ్బందులు లేకుండా గత ప్రభుత్వం పకడ్బందీ కార్యాచరణ అమలు చేసింది.



బస్టాండ్ పరిశీలిస్తున్న కేంద్ర కమిటీతో ఎంపీ గురుమూర్తి

కేంద్ర కమిటీ పరిశీలన

కేంద్ర ప్రభుత్వం సహకారంతో తిరుపతి బస్టాండ్‌లో సకల సౌకర్యాలను కల్పించడానికి గత సర్కార్ నిర్ణయించింది. ఈ క్రమంలో 2023 ఫిబ్రవరి నుంచి 2024 ఫిబ్రవరి వరకు 11 సార్లు కేంద్రం నుంచి ప్రత్యేక బృందాలు తిరుపతి బస్టాండ్‌ను పరిశీలించాయి. ఒక్కో అంశంపై క్షుణ్ణంగా నివేదికను సిద్ధం చేశాయి. బస్టాండ్ విస్తీర్ణం, భూమి స్థితిగతులు, ఎన్ని బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. ఎంతమంది ప్రయాణికులు వచ్చి వెళుతుంటారు, ఎన్ని ప్లాట్‌ఫామ్‌లు ఉన్నాయి, ఎంతమంది ఉద్యోగులు పనిచేస్తున్నారు, కార్గో ఆదాయం పరిస్థితి ఏంటి, బస్టాండ్‌లోని దుకాణాల్లో వ్యాపారం ఎలా నడుస్తోంది, చుట్టుపక్కల రోడ్ల పరిస్థితి ఏంటి అని క్షేత్రస్థాయిలో తనిఖీ చేశాయి. ఈ క్రమంలో ఒక్కో బృందం ఆర్టీసీ అధికారులకు ఒక్కో టాస్క్‌ను ఇచ్చేది. అందులో భాగంగానే విద్యుత్ బస్సుల కోసం అదనంగా మరేటి 100 చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాలని కేంద్ర కమిటీ సూచించింది. అలాగే మోడల్ బస్టాండ్ నిర్మాణానికి సమీపంలోని 22 మందికి చెందిన ప్రైవేట్ స్థలానికి సేకరించాలని ఆదేశించింది. వారికి ముందస్తుగా పరిహారం చెల్లించి నిర్మాణానికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేసింది. ఈ పనులు పూర్తయితే 3 నెలల్లో టెండర్లు పిలుస్తామని, మూడేళ్లలో మోడల్ బస్టాండ్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని కేంద్ర కమిటీ వెల్లడించింది. అయితే ఆ సమయంలో వెంటనే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందడుగు వేయలేక పోయింది.

ఎమ్మెల్యే గైర్హాజరు


తిరుపతి బస్టాండ్‌కు ఆదివారం సెంట్రల్ నుంచి నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ సీఈఓ ప్రకాష్ గౌర్, ప్రాజెక్ట్ డైరెక్టర్ పూజా మిశ్రా విచ్చేశారు. ఎంపీ గురుమూర్తి, ఆర్టీసీ అధికారులు వారికి స్వాగతం పలికారు. అయితే తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాత్రం హాజరుకాలేదు. కేంద్ర కమిటీ వచ్చినప్పుడు ఎమ్మెల్యే కనీసం ప్రోటోకాల్ కూడా పాటించకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ సీఈఓ ప్రకాష్ గౌర్ సైతం అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో కమిటీని ఎమ్మెల్యే ఆరణి సాయంత్రం కలిసి పుష్పగుచ్ఛం అందించడం కొసమెరుపు.

బస్టాండ్ స్థితిగతులు ఇవీ..

తిరుపతి సెంట్రల్ బస్టాండ్ ప్రాంగణంలో శ్రీహరి, శ్రీనివాస, ఏడుకొండలు, పల్లెవెలుగు పేరుతో బస్టాండ్లు ఉన్నాయి. శ్రీహరి బస్టాండ్‌లో 1 నుంచి 20 వరకు ప్లాట్‌ఫామ్‌లు, శ్రీనివాస బస్టాండ్‌లో 21 నుంచి 44 వరకు ప్లాట్‌ఫామ్‌లు, ఏడుకొండల బస్టాండ్‌లో 45 నుంచి 57 వరకు ప్లాట్‌ఫామ్‌లు, పల్లెవెలుగు బస్టాండ్‌లో 58 నుంచి 64 వరకు ప్లాట్‌ఫామ్‌లు అందుబాటులో ఉన్నాయి. తిరుపతి బస్టాండ్‌కు రోజుకు 3వేల నుంచి 5వేల సర్వీసులు వచ్చిపోతుంటాయి . ఒక్క తిరుపతి నుంచే రోజు 1.25 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రద్దీ క్రమంలో తిరుపతి బస్టాండ్‌లోని 64 ప్లాట్‌ఫామ్‌లలో ఎక్కడ తమ బస్సు ఎక్కాలో తెలియక నానా అవస్థలు పడుతుంటారు.

కూటమి సర్కార్ అలసత్వం

తిరుపతి మోడల్ బస్టాండ్ నిర్మాణంపై కూటమి సర్కార్ అలసత్వం వహిస్తోంది. అధికారం చేపట్టి రెండు నెలలు గడుస్తున్నా బస్టాండ్ పనులకు సంబంధించి ఒక్క అడుగు కూడా వేయలేదు. ప్రధానంగా నిర్వాసితులకు పరిహారం చెల్లించేందుకు చర్యలు చేపట్టలేదు., నూతన రీచార్జి పాయింట్లు ఏర్పాటు చేయలేదు. బస్టాండ్ నిర్మించే సమయంలో ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ బస్టాండ్ ఏర్పాటుపై దృష్టి సారించలేదు. అలాగే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వినూత్నంగా ఆలోచించి రూపకల్పన చేసిన తిరుపతి బస్టాండ్- రైల్వేస్టేషన్, బస్టాండ్- అలిపిరి సర్కిల్ రోప్ వే ప్రతిపాదనలను సైతం పట్టించుకోవడం లేదు.



జగనన్న హయాంలోనే రూపకల్పన



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుపతిలో మల్టీ మోడల్ బస్టాండ్‌కు రూపకల్పన చేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే బస్టాండ్ నిర్మించేందుకు రంగం సిద్ధం చేశాం. నిర్మాణానికి అవసరమైన అన్ని అనుమతులు గత ప్రభుత్వంలోనే సాధించాం. పక్కాగా ఆలోచించి డిజైన్లు రూపొందించాం. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసి బస్టాండ్ నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరాం. ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేలా బస్ టెర్మినల్, వాణిజ్య సముదాయాలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, బస్టాండ్, రైల్వే స్టేషన్‌కి అనుసంధానం చేస్తూ స్కైవాక్, డార్మెటరీలు, ఎలక్ట్రిక్ బస్సుల కోసం చార్జింగ్ స్టేషన్ ఏర్పాటుకు డిజైన్లతో స్థానం కల్పించాం . 13 ఎకరాల విస్తీర్ణంలోని ఈ బస్టాండ్ నిర్మాణానికి 22 మందికి పరిహారం ఇవ్వాల్సి ఉంటుంది.

– గురుమూర్తి, ఎంపీ, తిరుపతి



తిరుపతి మల్టీ మోడల్ బస్టాండ్ డీపీఆర్



నమూనా చిత్రం



బస్టాండ్‌లో కల్పించనున్న వసతులపై నమూనా చిత్రం

● నయనానందకరం



శ్రీకృష్ణాష్టమి వేడుకలకు తిరుపతిలోని ఇస్కాన్ టెంపుల్‌ను శోభాయమానంగా అలంకరించారు. సుగంధ సుమాలతో నందనందనుడి కోవెలను అద్భుతంగా తీర్చిదిద్దారు. గోపికా మానసచోరునికి సోమవారం నిర్వహించనున్న ప్రత్యేక పూజలకు సర్వం సిద్ధం చేశారు.

– తిరుపతి కల్చరల్

తిరుమలలో తనిఖీలు



సూచనలిస్తున్న టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరి

తిరుమల : తిరుమలలో నాలుగు మాడ వీధులు, లడ్డూ కౌంటర్లను ఆదివారం టీటీడీ అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి, డిప్యూటీ ఈఓ లోకనాథం, ఇతర అధికారులతో కలిసి తనిఖీ చేశారు. అక్టోబర్ 4వ తేదీ నుంచి ప్రారంభంకానున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన గరుడ సేవ రోజున లక్షలాదిగా విచ్చేసే భక్తుల ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను పరిశీలించారు. అనంతరం లడ్డూ ప్రసాదం కాంప్లెక్స్‌ను సందర్శించారు. , భక్తులు అధిక సమయం వేచి ఉండకుండా, త్వరితగతిన లడ్డూలను పంపిణీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వీజిఓ సురేంద్ర, ఏవీఎస్ఓ మనోహర్ పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయ క్రీడా దినోత్సవ ప్రత్యేక పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఈ నెల 29న మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నుంచి 31వ తేదీ వరకు విద్యార్థులు, క్రీడాకారులకు ప్రత్యేక పోటీలు నిర్వహించనున్నారు. రాష్ట్ర క్రీడా సంస్థ, జిల్లా కలెక్టర్ మార్గదర్శకాలకు అనుగుణంగా క్విజ్, వ్యాస రచన, వాక్‌రేస్, వాలీబాల్, హాకీ, మినీ ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, చెస్, జూడో, బాక్సింగ్, యోగా తదితర క్రీడల్లో పోటీలు ఉంటాయని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.సయ్యద్ సాహెబ్ తెలిపారు. అలాగే ఈ నెల 29న ర్యాలీ నిర్వహిస్తామని, అన్ని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఆస్పత్రుల్లో భద్రత పెంచాలి



ప్రభుత్వ ఆస్పత్రుల్లో సెక్యూరిటీని మరింత పెంచాలి. ముఖ్యంగా రాత్రిళ్లు విధుల్లో ఉన్న నర్సులు, మహిళా వైద్యులకు భద్రత కల్పించాల్సిన అవసరం ఉంది. ఈ మధ్య ఎక్కువగా దాడులు జరుగుతున్నాయి. అవి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి. సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలి.

– డాక్టర్ లావణ్య, సివిల్ అసిస్టెంట్ సర్జన్, నూళ్లూరుపేట



నిందితుడికి ఉరిశిక్ష వేయాలి



రోగులకు వైద్యం అందించడానికి డాక్టర్లు ఎంతో శ్రమిస్తుంటారు. అలాంటి వారిపై దాడులు తగదు. కోల్‌కతాలో డాక్టర్‌ను హత్య చేసిన నిందితుడికి ఉరిశిక్ష వేయాలి. ఆస్పత్రుల్లో మహిళా డాక్టర్లు, సిబ్బందికి సరైన వసతులు కల్పించాలి. ముఖ్యంగా పోలీసు భద్రత ఏర్పాటుచేయాలి. అప్పుడే ధైర్యంగా విధులు నిర్వహించేందుకు అవకాశం ఉంటుంది.

– పి.లక్ష్మి, స్టాఫ్‌నర్స్, పెళ్లకూరు పీహెచ్‌సీ

క్లుప్తంగా

కోడిపందెంరాయుళ్ల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పెళ్లకూరు : మండలంలోని కానూరు రాజుపాళెం అటవీ ప్రాంతంలో ఆదివారం నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరాలపై ఎస్ఐ శ్రీకాంత్ తమ సిబ్బందితో కలిసి దాడి చేశారు. 19 మంది పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. 10 బైక్‌లు, 17 సెల్‌ఫోన్లు, రెండు కోళ్లు, రూ.3,280 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

8 ద్విచక్ర వాహనాల సీజ్



సూచనలిస్తున్న సీఐ తిమ్మయ్య

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని కారణి గ్రామంలో రికార్డు లేని 8 ద్విచక్ర వాహనాలను సీఐ తిమ్మయ్య ఆదివారం సీజ్ చేశారు. ఆయన మాట్లాడుతూ రికార్డులేని వాహనాలతో రోడ్డెక్కితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు త్రిబుల్ రైడింగ్ చేసినా, ఆటోల్లో నిబంధనలకు విరుద్ధంగా అధిక సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించుకున్నా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

నాయుడుపేటటౌన్ : మండలంలోని అన్నమేడు రైల్వే గేటు వద్ద జనశతాబ్ది ఎక్స్‌ప్రెస్ కింద పడి ఓ వ్యక్తి ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గూడూరు రైల్వే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతుడి సెల్‌ఫోన్ ఆధారంగా వివరాలు తెలుసుకున్నారు. కోట మండలం ఊనుగుంట పాళెం గ్రామానికి చెందిన మిట్టగుంట పెంచలయ్య (35)గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహానికి స్థానిక ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబీకులకు అప్పగించారు.

విద్యార్థి అదృశ్యం



లోకేష్ నాయక్ (ఫైల్)

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు వద్ద ఏకలవ్య మోడల్ ఎస్టీ గురుకులంలో 10వ తరగతి విద్యార్థి లోకేష్‌నాయక్ అదృశ్యమైయ్యాడు. ఆదివారం విద్యార్థి తండ్రి బాలునాయక్ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం రాత్రి వరకు హాస్టల్ ఉన్న లోకేష్‌నాయక్ శనివారం ఉదయం కనిపించడం లేదని పేర్కొన్నారు.



● వినూత్న నిరసన

సిమ్స్‌లో జూనియర్ డాక్టర్ల ఆందోళన ఆదివారం కూడా కొనసాగింది. స్విమ్స్ అత్యవసర విభాగంలో పీజీ వైద్య విద్యార్థినిపై రోగి దాడి చేసిన ఘటనపై వారు మండిపడుతున్నారు. తమ రక్షణపై టీటీడీ ఈఓ రాతపూర్వకంగా భరోసా ఇస్తేనే ఆందోళన విరమిస్తామని జూనియర్ డాక్టర్లు స్పష్టం చేశారు. ఈ క్రమంలో చీపుర్లు చేతబట్టి స్విమ్స్ వద్ద చెత్త ఊడుస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. – తిరుపతి తుడా

నేడు తిరుపతి నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

● అందరూ సహకరించాలని పోలీస్ విజ్ఞప్తి

తిరుపతి క్రైమ్: తిరుపతిలోని హరే రామ హరే కృష్ణ రోడ్‌లోని ఇస్కాన్ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నగరంలో సోమవారం నుంచి ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్టు ఎస్పీ కార్యాలయం ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది.

ట్రాఫిక్ మళ్లింపు ఇలా..

- ఇస్కాన్ అలయం ముందున్న రోడ్డును రుయా ఆస్పత్రి జంక్షన్ నుంచి వచ్చే ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలను నియత్రించేందుకు బారికేడ్లు ఏర్పాటు చేయనున్నారు.
- ఉత్సవాలకు వచ్చే భక్తుల వాహనాలను అలిపిరి లింక్ బస్టాండ్ పార్కింగ్ స్థలంలో ఉంచి కాలినడకన గుడికి చేరుకోవాలి.
- గుడికి కుడి వైపు వున్న అన్నారావు సర్కిల్ రోడ్డు నుంచి వచ్చే వాహనాలను బారికేడ్ల ద్వారా నియంత్రిస్తారు.
- అన్నారావు సర్కిల్ నుంచి వచ్చే ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలను బాలాజీ లింక్ బస్టాండ్ దగ్గర ఉన్న ద్విచక్ర వాహనాల పార్కింగ్ స్థలంలో పార్కింగ్ చేయాలి.
- గుడికి వెళ్లే మార్గంలో ఇరువైపులా ఉన్న గృహ సముదాయాలకు వెళ్లే మార్గాలను కూడా బారికేడ్ల ద్వారా నియంత్రిస్తారు.
- ఉత్సవాలు జరిగే ప్రాంతంలో పుష్ కార్టులు, జెయింట్ వీల్స్, వినోదానికి సంబందించిన ఆటలకు అనుమతి లేదు. ఇస్కాన్ టెంపుల్ జారీ చేసిన దర్శనం టికెట్లు గలవారు, వారికి కేటాయించిన సమయంలోనే రావాలి. ఇస్కాన్ టెంపుల్ వారు ప్రసాదాలు ఇచ్చేందుకు గుడి లోపల 16 ప్రసాదం కౌంటర్లను ఏర్పాటు చేశారు. అందులో భక్తులు ప్రసాదాలు వరుస క్రమంలో వెళ్లి ప్రసాదాలు తీసుకోవాలి. భక్తులు ఈ విషయాలు గమనించి సహకరించాలని పోలీసులు కోరారు.

19 మంది ఎర్ర స్మగ్లర్ల అరెస్ట్



టాస్క్‌ఫోర్స్ పోలీసుల అదుపులో నిందితులు, వాహనాలు, ఆయుధాలు

చంద్రగిరి : తిరుపతి సమీపంలోని నాగపట్ల అటవీ ప్రాంతంలోకి చొరబడుతున్న 19 మంది ఎర్రచందనం స్మగ్లర్లను టాస్క్ ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్సు ఇన్‌చార్జ్, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదేశాల మేరకు, టాస్క్ ఫోర్సు ఎస్పీ కే.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డికి చెందిన కేఎస్కే లింగాధర్ టీమ్ ఆదివారం కూంబింగ్ చేపట్టింది. ఈ బృందం బాకరాపేట చేరి, అక్కడి నుంచి శ్రీవారిమెట్టు వైపు ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను తనిఖీ చేస్తుండగా, చంద్రగిరి మండలం, నాగపట్ల అటవీ పరిధిలోని నరసింగాపురం రైల్వే గేటు సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో మూడు వాహనాలు కనిపించాయి. వాహనాలను చుట్టుముట్టి తనిఖీ చేస్తుండగా, అందులోని వ్యక్తులు పారిపోయే ప్రయత్నం చేశారు. వారిని అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. కారులో నాలుగు పిడిలేని గొడ్డళ్లు, ఒక బరిసె, నాలుగు రంపాలు ఉన్నాయి. వారిని విచారించగా ఎర్రచందనం కోసం అడవిలోకి వెళుతున్నట్లు తెలిసింది. అరెస్టయిన వారిలో తిరుపతి సత్యనారాయణపురానికి చెందిన ఎస్వీ శివ (45), డీ.జానకీరామ్ (36), రైల్వే కోడూరుకు చెందిన నాయని శివ (36), తోట లక్ష్మీపతి (30), కార్వేటి నగరానికి చెందిన ప్రభాకర్ (45), తమిళనాడు తిరువణ్ణామలై జిల్లాకు చెందిన దక్షిణామూర్తి (29), సినరాజా (49), కుమార్ చిన్నపయ్యన్ (35), తిరుపత్తూరు జిల్లాకు చెందిన రామలింగరాజు (54), పార్తిబన్ కుమార్ (24), స్వామినాథన్ అన్నామలై (38), వాసుమణి (23), ఆర్.రవి (40), ఏ.అన్నామలై (35), కార్తీక్ (42), సేతుమణి (26), శంకర్ (44), కుమార్ రాజా (44), కార్తీక్ (25)లు ఉన్నారు. వీరిని తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేయగా, సీఐ సురేష్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల భద్రతపై సమీక్ష



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుమల: తిరుమలలో అక్టోబర్ 4వ తేదీ నుంచి శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదివారం భద్రతపై సమీక్ష చేపట్టారు. ఔటర్ రింగ్ రోడ్డు, వాహనాల పార్కింగ్ ప్రాంతాలు, తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. భక్తులు, యాత్రికుల భద్రతే పరమావధిగా భావించి పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని, తదనుగుణంగా కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. డాగ్ స్క్వాడ్, బీడీ టీమ్, స్పెషల్ పార్టీ పోలీసులతో అప్ ఘాట్, డౌన్ ఘాట్ రోడ్లను నిరంతరం కూంబింగ్ చేయాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న భద్రత ఏర్పాట్లను సమీక్షించి, రాత్రిళ్లు తిరుమల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ప్రత్యేకంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ అమలు చేయాలని, అవసరమైన పార్కింగ్ ప్రదేశాలను గుర్తించాలని పేర్కొన్నారు. తిరుపతి అలిపిరి చెక్ పాయింట్ నుంచి తిరుమల జీఎన్సీ టోల్‌గేట్ వరకు పక్కా ప్రణాళికతో చర్యలు చేపట్టాలని పోలీసులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటరావు, తిరుమల డీఎస్పీ విజయశేఖర్, సీఐలు విజయకుమార్, రాము, ఎస్ఐలు, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఏనుగు మృతి

– అలస్యంగా వెలుగుచూసిన ఘటన



అనారోగ్యంతో మృతి చెందిన ఏనుగు

భాకరాపేట: అనారోగ్యంతో ఏనుగు మృతిచెందిన ఘటన తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గం, ఎర్రావారిపాళెం మండలం, పులిబోనుపల్లె అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. డీఎఫ్ఓ సతీష్‌రెడ్డి కథనం.. అనారోగ్యం కారణంగా పులిబోనుపల్లె అటవీ ప్రాంతంలో వారం క్రితం ఏనుగు మృతిచెందింది. ఆదివారం అటుగా వెళ్లిన పశువుల కాపరులు గుర్తించి సమాచారం అందించారు. ఏనుగు మృతికి గల కారణాలు తెలియరాలేదు. సోమవారం పోస్టుమార్టం నిర్వహిస్తామని డీఎఫ్ఓ తెలిపారు. సీసీఎఫ్ నాగేశ్వరరావు ఏనుగు కళేబరాన్ని సందర్శించారు. అలాగే తిరుపతి జూ కన్జర్వేటర్ సెల్వం, భాకరాపేట ఫారెస్ట్ అధికారి దత్తాత్రేయ పాల్గొన్నారు.

నారాయణాద్రిలో రోబోటిక్ సర్జరీ



రోబోటిక్ సర్జరీ నిర్వహిస్తున్న డాక్టర్ సునంద కుమార్ రెడ్డి

తిరుపతి తుడా : తిరుపతిలోని ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రిలో రోబోటిక్ రీప్లేస్‌మెంట్ ఆపరేషన్లను విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు డాక్టర్ సునంద కుమార్ రెడ్డి తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆదివారం ఒక్క రోజే రోబోటిక్ టెక్నాలజీతో ముగ్గురికి కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు పూర్తి చేశామన్నారు. ఆస్టర్ నారాయణద్రిలో రోబోటిక్ అండ్ రివిజన్ డీకేఆర్ సేవలను అత్యాధునికంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. గతంలో టీకేఆర్ ఆపరేషన్లు చేసుకున్న వాళ్లకి కూడా రివిజన్ టీకేఆర్ ఆపరేషన్లు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. బెంగళూరు ఆస్టర్ సహకారంతో పటిష్టమైన వైద్య వ్యవస్థతో ఆర్థోపెటిక్ సేవలు అందిస్తున్నామన్నారు. చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్మని మాట్లాడుతూ ఆస్టర్ నారాయణాద్రిలో ఆధునిక వైద్య పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ఇక్కడి వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వడదెబ్బతో కూలీ మృతి



జయరామయ్య (ఫైల్)

ఏర్పేడు : మండలంలోని కందాడు ఎస్సీ కాలనీలో ఆదివారం వడదెబ్బతో వ్యవసాయ కూలీ మృతి చెందాడు. వివరాలు.. కాలనీకి చెందిన పారి జయరామయ్య(59)శనివారం కూలి పనికి వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా ఎండ తీవ్రతకు అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబీకులు వెంటనే రేణిగుంటలోని ఓ ప్రైవేట్‌ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ ఆదివారం మరణించాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

వీసీ దొరస్వామికి పాతూరి పురస్కారం



దొరస్వామికి పురస్కారం అందిస్తున్న అతిథులు

పటమట(విజయవాడతూర్పు) : కుప్పంలోని ద్రవిడ వర్సిటీ లైబ్రేరియన్, ఇన్‌చార్జి వీసీ డాక్టర్ ఎం.దొరస్వామికి పాతూరి నాగభూషణం పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఆదివారం విజయవాడలోని సర్వోత్తమ గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎస్వీయూ గ్రంథపాలకుడు ఆచార్య కొంగర సురేంద్రబాబు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల పూర్వవైభవం తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. 50ఏళ్లకు పైగా గ్రంథాలయా ప్రగతికి కృషిచేసిన వీసీ దొరస్వామికి పాతూరి పురస్కారం ప్రదానం చేయడం స్ఫూర్తిదాయకమన్నారు. గౌతమి గ్రంథాలయ విశ్రాంత గ్రంథపాలకుడు సన్నిధానం నరసింహశర్మ మాట్లాడుతూ నాటి రోజుల్లో గ్రంథాలయ ఉద్యమానికి మాత్రమే పాతూరి పరిమితమై తన సేవలను బహుముఖాలుగా విస్తరింపజేశారని కొనియాడారు. వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్ మాట్లాడుతూ దొరస్వామి పట్టుదల, అంకితభావం, పాలనాదక్షతలతో గ్రంథాలయానికి గుర్తింపు తీసుకువచ్చారని ప్రశంసించారు. సిద్ధార్థ లా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దివాకరబాబు మాట్లాడుతూ వృత్తిలో నిబద్ధత, క్రమశిక్షణ, పట్టుదలలే దొరస్వామికి ఈ పురస్కారం రావడానికి ప్రధానకారణాలని తెలిపారు. అనంతరం జ్ఞాపిక, సన్మానపత్రం, నూతన వస్త్రాలతో పాతూరి పురస్కారాన్ని దొరస్వామికి అందజేసి అభినందించారు. ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ రావి శారద, ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయ గ్రంథాలయ ఇన్‌చార్జి శ్రీనివాస్, గుంటూరు హనుమయ్య ఫార్మసీ కళాశాల గ్రంథపాలకుడు డాక్టర్ మల్లికార్జునరావు, ద్రవిడ విశ్వవిద్యాలయం గ్రంథాలయ శాస్త్ర విశ్రాంత సహాయ ఆచార్యులు డాక్టర్ అంజయ్య, కాకినాడ జేఎన్టీయూ గ్రంథపాలకుడు ఆచార్య దొరస్వామినాయక్, మైలవరం ఇంజినీరింగ్ కళాశాల లైబ్రేరియన్ సాంబశివరావు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

తిరుపతి రూరల్ : రాష్ట్రంలోని పలు జిల్లాల్లో చోరీలకు పాల్పడిన నిందితుడిని ఆదివారం తిరుపతి రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ షేక్షావలీ కథనం మేరకు.. గుంటూరు జిల్లా తాడేపల్లికు చెందిన గరిక.సుబ్బరాజు(22) ఇప్పటికే పలుమార్లు దొంగతనాలకు పాల్పడి జైలుకు వెళ్లాడు. ఇటీవల తిరుపతిలోనూ బైక్‌లను అపహరించాడు. వాటిపై తిరుగుతూ తుమ్మలగుంట, లెప్రసీ కాలనీల్లో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డాడు. తుమ్మలగుంట ఘటన తర్వాత ఎస్ఐ షేక్షావలీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం సుబ్బరాజుపై ప్రత్యేక నిఘా పెట్టారు. విజయనగరంలోనూ నిందితుడు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడినట్లు గుర్తించారు. ఆదివారం నిందితుడిని అరెస్ట్ చేసి రెండు బైక్‌లు, 30 గ్రాముల రెండు బంగారు చైన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

అనుమానాస్పదంగా వివాహిత మృతి

దొరవారిసత్రం : మండలంలోని క్రిష్ణప్పకండ్రిగ వద్ద అనుమానాస్పదంగా ఓ వివాహిత మృతి చెందింది. వివరాలు.. వేణుంబాకం గ్రామంలోని ఎస్టీ కాలనీకి చెందిన చిలకల రమేష్ భార్య శాంతి(36) శనివారం మధ్యాహ్నం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబీలు, స్థానికులు రాత్రంతా గాలించినా ఆచూకీ దొరకలేదు. ఆదివారం ఉదయం క్రిష్ణప్పకండ్రిగ గ్రామ సమీపంలోని పంట పొలాల వద్ద వేప చెట్టుకు ఆమె మృతదేహం వేలాడుతూ వేలాడుతూ కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుమలరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చంద్రగిరి : పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై అగరాల సమీపంలో ఆదివారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. సదరు వ్యక్తి రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళుతుండగా వెనుక నుంచి మారుతి ఓమినీ వ్యాను ఢీకొంది. డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదలి పరారయ్యాడు. రోడ్డుపై వస్తున్న వాహనాలు మృతదేహాన్ని తొక్కేయడంతో తల నుజ్జునుజ్జుగా మారింది. మృతదేహంపై ఉన్న షర్ట్ జేబులో తిరుమల అశ్విని ఆస్పత్రిలో చికిత్స పొందిన చీటీ దొరికింది. అందులో అన్బుదాస్ అని పేర్కొని ఉండడంతో మృతుడి పేరు అదే అయివుంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమెరికాలో 'పేట' వైద్యుడి మృతి



రమేష్‌బాబు (ఫైల్)

నాయుడుపేట టౌన్ : అమెరికాలో నాయుడుపేట మండలం మేనకూరుకు చెందిన డాక్టర్ రమేష్‌బాబు పేరం శెట్టి (64) మృతి చెందినట్లు శనివారం రాత్రి సమాచారం అందింది. అమెరికాలోని టస్కలూసాలో నివసిస్తున్న రమేష్ బాబు శుక్రవారం సాయంత్రం ఇంటి వద్ద కారు పార్కింగ్ చేసి వస్తుండగా జరిగిన కాల్పుల్లో మరణించినట్లు స్థానికంగా ఉన్న వారి కుటుంబీకులకు తెలిసింది. పూర్తి వివరాలను తెలియరాలేదని తిరుపతికి చెందిన మృతుడి తమ్ముడు పేరంశెట్టి సురేష్ తెలిపారు. అమెరికా పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారని ఆదివారం సాయంత్రం వరకు కూడా రమేష్‌బాబు మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించలేదని వెల్లడించారు. ఈ నెల 15తేదీనే రమేష్‌బాబు కుటుంబసమేతంగా నాయుడుపేటకు వచ్చి వెళ్లారని, ఇంతలోనే ఇలా జరగడం తట్టుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లి, మరికొందరు బంధువులతో కలిసి అమెరికా బయలుదేరుతున్నామని వివరించారు.

పుట్టిన ఊరంటే ఎంతో అభిమానం

రమేష్‌బాబు తండ్రి చిన గురునాథం సామాన్య రైతు. 10వ తరగతి వరకు ఆయన మేనకూరు ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నారు. తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజీలో వైద్యవిద్యనభ్యసించారు. సుమారు 30 ఏళ్ల క్రితమే రమేష్‌బాబు అమెరికాకు వెళ్లి స్థిరపడ్డారు. అక్కడే పలు ఆస్పత్రులు నిర్మించి వైద్యసేవలందిస్తున్నారు. అక్కడి ప్రముఖుల నుంచి పలు సందర్భాల్లో అభినందనలు, సత్కారాలు అందుకున్నారు. రమేష్‌బాబుకు స్వగ్రామం మేనకూరు అంటే ఎనలేని అభిమానం. గ్రామంలోని తన ఇంటిని పాఠశాలకు ఉచితంగా ఇచ్చారు. తాను చదువుకున్న ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి రూ.లక్షల విరాళం అందజేశారు. గ్రామంలో ఇటీవల నిర్మాణం చేపట్టిన సాయిబాబా ఆలయానికి రూ. 20 లక్షల విరాళం అందించారు. అలాగే పలు సంక్షేమ కార్యక్రమాలకు సైతం తన వంతు సాయం అందించారని గ్రామస్తులు వెల్లడిస్తున్నారు. ఆయన మృతి చెందారనే వార్తను జీర్ణించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పలువురి సంతాపం

రమేష్‌బాబు మృతికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి కట్టా సుధాకర్ రెడ్డి, కట్టా జ్యోతిరెడ్డి, కట్టా వెంకట రమణారెడ్డి, కట్టా భవానిరెడ్డి, నల్లు కస్తూరయ్య, చెన్నకేశవులు సంతాపం తెలిపారు.

చిన్నారుల దీక్ష



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న బాలుడు

తిరుపతి(అలిపిరి): శ్రీవారి మెట్టు చిరు వ్యాపారులకు న్యాయం చేయమని కోరుతూ వారి పిల్లలు ఆదివారం నిరసన దీక్షలో కూర్చొన్నారు. టీటీడీ అధికారులు తమ కుటుంబాలకు న్యాయం చేయాలని, తల్లిదండ్రులను ఆదుకోవాలని, శ్రీవారి మెట్టుపై వ్యాపారాలను అనుమతించాలని, తమ స్కూల్ ఫీజుల చెల్లింపునకు సహకరించాలని నినాదాలు చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ చిరు వ్యాపారుల సమస్య న్యాయమైందని.. పరిష్కారానికి టీటీడీ యాజమాన్యం సహకరించాలని కోరారు. ఎస్.జయచంద్ర, గండికోట నాగ వెంకటేష్, గంగులప్ప, రవి, చిట్టిబాబు, మధు, యుగంధర్, రామ్మూర్తి, నరసింహ, చిరంజీవి, గిరి పాల్గొన్నారు.

గూడూరు సబ్ కలెక్టర్‌గా రాఘవేంద్ర మీనా



చిల్లకూరు: గూడూరు ఆర్డీఓగా పనిచేస్తుండిన మీసాల కిరణ్ కుమార్ ఆదివారం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నూతనంగా ఐఏఎస్ అధికారి రాఘవేంద్ర మీనాను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. పలు సమస్యలను పరిష్కరించే క్రమంలో ఐఏఎస్ అధికారి అయితే బాగుంటుందని భావించిన ప్రభుత్వం రాఘవేంద్ర మీనాను నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇక్కడ పనిచేస్తుండిన కిరణ్‌కుమార్‌కు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు.

అలిపిరిలో విస్తృత తనిఖీలు



తనిఖీలు చేస్తున్న డీఎస్పీ విజయ్ శేఖర్

తిరుపతి క్రైమ్: తిరుమలకు వెళ్లే అలిపిరి చెక్ పాయింట్ వద్ద డీఎస్పీ విజయ్ శేఖర్ ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తిరుమలకు వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ద్విచక్ర వాహనదారుల లైసెన్సులు, హెల్మెట్ తప్పనిసరిగా చెక్ చేయాలని ఆదేశించారు. అనంతరం కంట్రోల్ రూమ్‌లో తనిఖీ చేశారు. నిరంతరం వచ్చి పోయే వాహనాలను తనిఖీ చేయడమే కాకుండా కంట్రోల్ రూమును పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు.